సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్లు

జగద్గిరిగుట్ట : చింతల్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో కార్పొరేటర్లు కొలుకుల జగన్, మంత్రి సత్యనారాయణ 57 మంది లబ్ధిదారులకు రూ. 21.46 లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ ఎంతో భరోసా కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, పలు డివిజన్ల అధ్యక్షులతో పాటు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

నియామకం


చిన్నస్వామి

కుత్బుల్లాపూర్: మేడ్చల్ జిల్లా ఎన్ఎస్‌యూఐ సోషల్ మీడియా చైర్మన్‌గా కుత్బుల్లాపూర్‌కు చెందిన చిన్న స్వామి నియమితులయ్యారు. ఈ మేరకు ఎన్ఎస్‌యూఐ సోషల్‌మీడియా చైర్మన్ కామిరెడ్డి శశాంక్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా చిన్నస్వామి మాట్లాడుతూ..తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఏఐసీసీ ఇన్‌చార్జి కన్నయ్యకుమార్, జాతీయ అధ్యక్షుడు వరుణ్‌చౌదరి, రాష్ట్ర చైర్మన్ శశాంక్, రాష్ట్ర నాయకుడు గొల్ల జాన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కేటీఆర్‌ను కలిసిన మున్సిపల్ మాజీ చైర్మన్


కేటీఆర్‌తో సన్న శ్రీశైలంయాదవ్, కవిత

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, మాజీ ఎంపీపీ సన్న కవిత బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకువచ్చే వరకు ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని కేటీఆర్ సూచించినట్లు వారు పేర్కొన్నారు. మాజీ వార్డు సభ్యుడు బొల్లం వేణు యాదవ్ తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న ఎడ్జిమెంట్ స్కూల్ వార్షికోత్సవం


నృత్యం చేస్తున్న చిన్నారులు

దుండిగల్: డి.పోచంపల్లిలోని ఎడ్జిమెంట్ ది గ్లోబల్ స్కూల్‌లో ఆదివారం రాత్రి వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రముఖ కవి నరసింహారెడ్డి, ఆక్స్‌ఫర్డ్ స్కూల్ కరస్పాండెంట్ సీహెచ్ నాగిరెడ్డి, గీతాంజలి గ్లోబల్ స్కూల్ డైరెక్టర్ నాగేశ్వర రావు, స్కూల్ డైరెక్టర్ స్వప్న, కరస్పాండెంట్ హనుమంత్‌రెడ్డి, శైలేంద్ర, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కుత్బుల్లాపూర్: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అసోం రాష్ట్రానికి చెందిన ప్రభాత డోలై (28) కొంపల్లి సమీపంలోని ఏడబ్ల్యూఎల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు.ఈనెల 2న సాయంత్రం తాను పనిచేసే కంపెనీ నుంచి మల్లన్న కాలనీలో ఉండే తన స్నేహితుడిని కలిసేందుకు వెళ్లాడు. అదే రోజు రాత్రి 9.30 గంటలకు తన స్నేహితుడి బైక్ తీసుకుని వస్తుండగా ప్రభాత సాయిగీతా ఆశ్రమం సమీపంలో బైక్ అదుపుతప్పి కింద పడ్డాడు. అతని తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికంగా ఉన్న వెల్‌నెస్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి అదృశ్యం

సుభాష్‌నగర్: వృద్ధుడు అదృశ్యమైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన శేఖర్‌రెడ్డి తండ్రి మన్మథరెడ్డి ఈనెల 8 న రాత్రి భోజనం అనంతరం నిద్రకు ఉపక్రమించాడు. కాగా 9న ఉదయం 6 గంటలకు నిద్ర లేచిచూడగా మన్మథరెడ్డి కనిపించ లేదు. రోజు మాదిరిగానే వాకింగ్‌కు వెళ్లి ఉంటాడని కుటుంబ సభ్యులు అనుకున్నారు. అయితే ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో చుట్టు పక్కల, స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో సోమవారం సూరారం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుంతలతో ఒళ్లు గుల్ల..!

కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్లలో అధ్వానంగా ప్రధాన రోడ్లు

- ఓ వైపు గుంతలు.. మరోవైపు అధ్వానంగా మ్యాన్‌హోళ్లు
- కోట్లాది నిధులు ఉన్నా.. మరమ్మతులు శూన్యం
- కనిపించని ఐఆర్‌టీ బృందాలు
- రాకపోకలకు వాహనదారుల తీవ్ర ఇబ్బందులు


ఐడీపీఎల్-జగద్గిరిగుట్ట రోడ్డులోని సంజయ్‌గాంధీనగర్ వద్ద..

జగద్గిరిగుట్ట ప్రధాన రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం సమీపంలో ఏర్పడిన గుంత



గురుమూర్తినగర్ కమిటీ హాల్ సమీపంలో..

రంగారెడ్డినగర్: కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలోని ప్రధాన రోడ్లు గుంతలమయంగా మారాయి. వాటికి మరమ్మతులు చేపట్టాల్సిన ఐఆర్‌టీ బృందాలు కానరాకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతూనే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. అక్టోబర్‌లోనే మాన్‌సూన్ బృందాల గడువు ముగిసింది. దీంతో కూకట్‌పల్లి జోన్ పరిధిలోని 4 సర్కిళ్ల పరిధిలో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టేందుకు 22 డివిజన్ల పరిధిలో ఐఆర్‌టీ బృందాలను ఏర్పాటు చేశారు. ఇందుకు గాను జోన్ మొత్తానికి రూ.4.5 కోట్ల నిధులు మంజూరు చేశారు. ఈ ఒక్కో బృందంలో డ్రైవర్, ఇద్దరు కార్మికులతో పాటు మరమ్మతులు నిర్వహించేందుకు సామగ్రి అందుబాటులో ఉంటుంది. అయితే కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో ఐఆర్‌టీ బృందాల పనితీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఐడీపీఎల్-జగద్గిరిగుట్ట రోడ్డు పలు చోట్ల ధ్వంసమైనా పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని సంజయ్‌గాంధీనగర్-జగద్గిరిగుట్ట రోడ్డులో గతేడాదిగా రోడ్డు పెచ్చులూడి గుంతలుగా మారింది. దీనికితోడూ సమీపంలోని భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు పొంగి మురుగు నీరు గుంతల్లోకి చేరుతోంది. అదేవిధంగా జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్ సమీపంలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడింది. ఈ విషయమై పలుమార్లు ఫిర్యాదు చేయగా రోడ్డుకు ఒక వైపే మరమ్మతులు చేపట్టి మరో వైపు వదిలేశారు. అలాగే గురుమూర్తినగర్ కమ్యూనిటీ హాల్ సమీపంలో, చింతల్ హ్యాపీ హోమ్స్ ఆస్పత్రి సమీపంలో మార్కెట్ రోడ్డు ఎంట్రన్స్‌లో, భగత్‌సింగ్‌నగర్ మోడ్రన్ ఫంక్షన్ హాల్ రోడ్డు, గాజులరామారం అయ్యప్ప కాలనీ తదితర ప్రాంతాల్లో రోడ్లు ధ్వంసమై రాకపోకలకు ఆటంకంగా మారాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఐఆర్‌టీ బృందాలతో రోడ్లకు మరమ్మతులు చేపట్టి రాకపోకలు సాఫీగా సాగేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.


చింతల్ హ్యాపీ హోమ్స్ ఆస్పత్రి సమీపంలో మార్కెట్‌కు వెళ్లే రోడ్డు..

రామలింగేశ్వర స్వామి ఆలయంలో చోరీ



జీడిమెట్ల: గాంధీనగర్‌లోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో చోరీ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సోమవారం ఉదయం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో ఇద్దరు వ్యక్తులు ఆలయంలోకి చొరబడ్డారు. గుడి తలుపులు పగులగొట్టి ఓ దొంగ లోనికి ప్రవేశించాడు. అనంతరం లింగంపై ఉంచిన నాగాభరణం, దారా పాత్రను ఎత్తుకెళ్లాడు. ఉదయం ఆలయ పూజారి, స్థానిక భక్తులు చోరీ జరిగిందని గుర్తించి జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే దొంగలు చెప్పులు వేసుకుని గుడిలోకి వెళ్లడంతో పాటు శివలింగంపై ఎక్కి దొంగిలించడాన్ని నిరసిస్తూ హిందువులు సోమవారం రాత్రి ఆందోళన చేపట్టారు. కాగా సోమవారం రాత్రి బాలానగర్ ఏసీపీ హనుమంతరావు జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేశ్ ఘటనా స్థలానికి చేరుకుని కాలనీవాసులను సముదాయించారు అనంతరం వివరాలు సేకరించారు. కాగా ఓ దొంగను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మరొకరి కోసం పోలీసులు గాలిస్తున్నారు. దొంగలు గుడిలోకి చొరబడిన తీరుతో పాటు చోరీ చేసిన దశ్యాలు సీసీ పుటేజీలో రికార్డు అయ్యాయి.


మహిళా టీచర్లను సన్మానిస్తున్న దృశ్యం

పీఆర్టీయూ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

నిజాంపేట్ : బాచుపల్లి మండలం పీఆర్టీయూ అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు పర్మగళ్ల నర్సింహులు, మాలి ప్రమోద్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లోని మహిళా ఉపాధ్యాయులను కలిసి సన్మానించారు. అనంతరం ఎంఈఓ ఎంవివి రామకృష్ణ మాట్లాడుతూ.. గతంలో మహిళలు కుటుంబానికే పరిమితమయ్యారని కానీ నేడు మహిళా సాధికారతతో అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు పి.శేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నయ్య, మండల కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వరరావు, సుమతి, శివప్రసాద్, శాంతి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు

కుత్బుల్లాపూర్ : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. కొంపల్లి మున్సిపాలిటీలో గత జనవరిలో ఆయన పాదయాత్ర నిర్వహించగా అపర్ణ కాలనీ, నూజివీడు కాలనీవాసుల నుంచి పలు ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకువెళ్లి రాయల్ పార్క్ నుంచి నూజివీడు బస్టాప్ వరకు నూతన రోడ్ల నిర్మాణానికి రూ. 2.50 కోట్ల హెచ్‌ఎండీఏ నిధులు మంజూరు చేయించి సోమవారం ప్రొసీడింగ్ కాపీని రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు కూన శ్రీశైలం గౌడ్‌ను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత పదేళ్లలో ఈ విషయమై స్థానిక ప్రజాప్రతినిధులకు ఎన్నోసార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు కూన శ్రీశైలం గౌడ్ సహకారంతో రోడ్డు పనులు చేపడుతుండడం ఆనందంగా ఉందన్నారు.


రోడ్డు పనుల ప్రొసీడింగ్ కాపీని చూపిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

అనంతరం శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భైరి ప్రశాంత్ గౌడ్, సిద్దిపేట మాజీ డైరెక్టర్ జీమ్మీ దేవేందర్, కాందాడి సుదర్శన్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ గోపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు చర్యలు చేపట్టాలి

నిజాంపేట్ : ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురికాకుండా పరిరక్షించాలని బాచుపల్లి మండల సీపీఐ కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు మేడ్చల్ జిల్లా సీపీఐ సహాయ కార్యదర్శి దామోదర్‌రెడ్డితో కలిసి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ డి.విజయేందర్ రెడ్డికి సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భూకబ్జాలు అధికమయ్యాయని ఈ విషయంలో మున్సిపల్, రెవెన్యూ అధికారులు పూర్తిగా విఫలం అయ్యారని ఆరోపించారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా సీపీఐ కౌన్సిల్ సభ్యులు ఈశ్వర్, యాదయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవ్వాలి


పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న సురేశ్‌కుమార్

చింతల్: ప్రతిఒక్కరూ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని లార్డ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు, లయన్ సురేశ్‌కుమార్ అన్నారు. గణేశ్‌లోని లార్డ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు సోమవారం చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికుల శ్రమవల్లే పరిసరాలు శుభ్రంగా ఉంటున్నాయని వారిని సత్కరించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ సూపర్‌వైజర్ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివలింగం, విగ్రహాల ప్రతిష్ఠ

జగద్గిరిగుట్ట: జగద్గిరినగర్ నల్ల పోచమ్మ ఆలయంలో శివలింగం, నవగ్రహాల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకం, అలంకరణ, హోమంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. స్థానిక కార్పొరేటర్ జగన్, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ జీకే శేఖర్ యాదవ్, కృష్ణ గౌడ్‌తో పాటు ఆలయ, బస్తీ కమిటీ సభ్యులు రాజ్‌కుమార్, నారాయణ గౌడ్, చిన్న, బొగ్గుల సురేశ్, యాదగిరి, శ్రీనివాస్ రెడ్డి, వెంకటేశ్, గోవర్ధన్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


నవగ్రహాల విగ్రహాలకు పూజలు చేస్తున్న అర్చకులు
శివ లింగం

బీటీ రోడ్డు వేయాలని వినతి


కమిషనర్ కృష్ణారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఉపేందర్‌రెడ్డి తదితరులు

కుత్బుల్లాపూర్: బీటీ రోడ్డు వేయాలని కోరుతూ టీపీసీసీ లేబర్ సెల్ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కొంపల్లి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డికి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీనివాస్‌నగర్‌కాలనీ ప్రధాన రోడ్డు పంజాబ్ నేషనల్ బ్యాంక్ నుంచి జయభేరి నందిచౌక్ వరకు రోడ్డు గుంతలుగా మారి వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. వెంటనే బీటీ రోడ్డు వేయాలని ఆయన కోరారు. టీపీసీసీ లేబర్ సెల్ కుత్బుల్లాపూర్ అధ్యక్షుడు కావాలి గోపాల్, మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, అంజి ముదిరాజ్, కాలనీవాసులు వెంకటేశ్ గౌడ్, గోపాలకృష్ణ, రాములు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఎంఎల్‌ఆర్ఐటీ కళాశాలకు వన మహోత్సవ్ అవార్డు

దుండిగల్: ఎంఎల్‌ఆర్ఐటీ కళాశాలకు వన మహోత్సవ్ అవార్డు లభించింది. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మర్రి లక్ష్మణ్ రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ జాతీయ సేవా పథకం విభాగం 2024 సంవత్సరంలో పెద్ద సంఖ్యలో మొక్కలు నాటి సంరక్షించినందుకు గాను కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ (సీఐఐ) ఈ అవార్డుకు ఎంపిక చేసింది. ఇటీవల నగరంలో జరిగిన సీఐఐ వార్షిక సదస్సులో సీఐఐ తెలంగాణ స్టేట్ చైర్మన్ డి.సాయి ప్రసాద్ ఎంఎల్‌ఆర్ఐటీ కళాశాలకు అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కే శ్రీనివాస్ రావు మాట్లాడారు. తమ కళాశాలకు వన మహోత్సవ్ అవార్డు సంతోషంగా ఉందన్నారు.


అవార్డుతో కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి

ప్రజావాణిలో 22 ఫిర్యాదులు


కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ నరసింహకు వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు


జలమండలి కార్యాలయంలో జీఎం అశోక్, సీజీఎం నారాయణ..

కుత్బుల్లాపూర్ : జంట సర్కిళ్ల పరిధిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 13 ఫిర్యాదులు వచ్చాయి. కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో 5 రాగా 3 టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్, శానిటేషన్ విభాగాలకు సంబంధించి ఒక్కొక్కటి ఫిర్యాదు రాగా. ఉప కమిషనర్ నరసింహ సంబంధిత అధికారులకు వాటిని పంపి తక్షణం పరిష్కరించాలని ఆదేశించారు. అదేవిధంగా గాజులరామారం సర్కిల్ పరిధిలో 8 ఫిర్యాదులు రాగా ఇంజినీరింగ్ 5, టౌన్ ప్లానింగ్ 2, యూజీడీ 1 వచ్చాయి. ఉప కమిషనర్ మల్లారెడ్డి విభాగాల వారీగా వాటిని పంపించి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ద్వారకానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాలాలో పేరుకుపోయిన చెత్తాచెదారంతో పాటు మట్టిని తొలగించాలని సంక్షేమ సంఘం అధ్యక్షుడు కళ్లెం శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఉప కమిషనర్ నరసింహకు వినతి పత్రం అందజేయగా సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ లక్ష్మీగణేశ్ మే మొదటి వారంలో ప్రక్రియ చేపడుతామని వారికి హామీనిచ్చారు.

జలమండలి కార్యాలయంలో..

చింతల్: కుత్బుల్లాపూర్ వాటర్‌వర్క్స్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో 9 ఫిర్యాదులు వచ్చాయి. పద్మానగర్, ఇంద్రసింగ్‌నగర్, తదితర కాలనీవాసులు తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు. కుత్బుల్లాపూర్ జనరల్ మేనేజర్ అశోక్ అధ్యక్షతన ప్రజావాణి జరుగుతుండగానే సీజీఎం నారాయణ అక్కడికి వచ్చారు. దీంతో నీటి సమస్యను ఎప్పుడూ పరిష్కరిస్తారు అంటూ..? సీజీఎం, జీఎంను నిలదీశారు. దీంతో సీజీఎం స్పందిస్తూ ఇటీవల హైదరాబాద్‌కు తరలించే ప్రధాన పైపులైన్లు మరమ్మతులు చేపడుతున్న కారణంగా నీటి సరఫరాలో కొంతమేర ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. అదేవిధంగా కేటాయించిన నీటికి, పెరిగిన జనాభాకు నీరు సరిపోవడం లేదని కొంతమేర నీటి కేటాయింపును పెంచుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

కలగానే క్యాంటీన్లు!

'దేవుడు వరమిచ్చినా..పూజారి కరుణించ లేదు' అన్నట్లు ఉంది కుత్బుల్లాపూర్ మహిళా సమైక్య ప్రతినిధుల పరిస్థితి. ఓవైపు ప్రభుత్వం మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావడమే లక్ష్యంగా ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నది. మరోవైపు అధికారుల నిర్లక్ష్యంతో అవి ఇక్కడి వారికి అందని ద్రాక్షగానే మిగిలిపోతున్నాయి.

– కుత్బుల్లాపూర్

- కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు నిల్
- మహిళా సమైక్య ప్రతినిధులకు ప్రోత్సాహం కరువు
- అధికారులు స్థలం కేటాయించక ముందుకు సాగని వైనం

గాజులరామారం సర్కిల్ పరిధిలో ఇప్పటికే 4 ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయం, కుత్బుల్లాపూర్ మండల ఆఫీస్, షాపూర్‌నగర్ ఎస్‌బీఐ వద్ద, జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ సమీపంలో వీటిని ఏర్పాటు చేశారు. అయితే కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో మాత్రం ఇప్పటివరకు ఒక్క క్యాంటీన్ కూడా ఓపెన్ చేయకపోవడం ఇక్కడి అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది.

స్థలం కేటాయించాలని విన్నపం..

కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని సమైక్య గ్రూపు సభ్యులు క్యాంటీన్ల ఏర్పాటు విషయమై పలుమార్లు ఉప కమిషనర్ నరసింహను కలిశారు. అయితే కమిషనర్ తర్వాత చూద్దాం..అంటూ కాలయాపన చేస్తున్నారని, 6 నెలలుగా ఇదే పరిస్థితి నెలకొందని పలువురు మహిళా సంఘాల ప్రతినిధులు 'సాక్షి'తో వాపోయారు. గత ప్రభుత్వంలో బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా ఉన్న వ్యక్తులతోనే సమైక్య గ్రూపు నాయకత్వం ఉండడం కారణంగానే అడ్డు తగులుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సర్కిల్ పరిధిలో మొత్తం 60 సమైక్య గ్రూపులు ఉండగా, వీరికి ఎక్కడో ఒకచోట ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటు చేయించి వారికి ఆర్థికంగా తోడ్పడాలి. కానీ ఇక్కడ మాత్రం సీన్ రివర్స్ గా ఉంది. ఇప్పటికైనా క్యాంటీన్ల ఏర్పాటుకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని మహిళా సమైక్య ప్రతినిధులు కోరుతున్నారు.


గాజులరామారం సర్కిల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్

ప్రాజెక్టు అధికారి నిర్లక్ష్యం వల్లే..



ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటు విషయంలో స్థలాల పర్యవేక్షణ బాధ్యత ప్రాజెక్ట్ అధికారిదే. సమైక్య గ్రూపులను కలుపుకొని స్థలాలను ఎంపిక చేస్తే వాటి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. సమైక్య గ్రూపు సభ్యులు తన వద్దకు వస్తే కూడా ఇదే విషయాన్ని చెప్పాను. ప్రాజెక్టు అధికారి పనితీరు వల్లే ఆలస్యం క్యాంటీన్ల ఏర్పాటు ఆలస్యం అవుతోంది. ఉన్నతాధికారులకు నివేదిక పంపించాను. త్వరలోనే క్యాంటీన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటా.

–నరసింహ, ఉప కమిషనర్, కుత్బుల్లాపూర్